సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం। 19। ఏప్రిల్। 2024



ఆడాళ్లా మజాకా..!

పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టంలో ప్రారంభించిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రగతి పథంలో నడుస్తోంది.

- 8లో



పెళ్లింట విషాదం

వధువుకు ఇవ్వాల్సిన సారె సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదం పెళ్లివారింట విషాదం నింపింది.

- 8లో

ప్రవేశ పరీక్ష రేపు

పార్వతీపురం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికి శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గురువారం తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశానికి పార్వతీపురంలో జరిగే ప్రవేశపరీక్షకు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకున్న 6,7,8,9 తరగతుల విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. ఆ రోజున ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ



నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ స్ఫూర్తి మహిళా మండలి ఆధ్వర్యంలో సాలూరు పట్టణంలోని 4వ వార్డులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళామండలి డైరెక్టర్ బలగ రాధ మాట్లాడుతూ,18 ఏళ్లు నిండకుండా బాల్యవివాహాలు చేయరాదని, అలా చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే ఆరోగ్యపరమైన, వ్యక్తిగత అనర్థాలను వార్డు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాధవి, సునీత, జాహ్నవి తదితర మహిళలు పాల్గొన్నారు.

వీడని ఏనుగుల బెడద

- సీమనాయుడువలసలో గజరాజుల సంచారం



సీమనాయుడువలస, వెంకటరాజపురం మధ్య పంట పొలంలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంచాయతీ సీమనాయుడువలస, వెంకటరాజపురం పంట పొలాల మధ్య ఏనుగుల గుంపు సంచరిస్తోంది. గురువారం ఉదయం అరటితోటలో ఉన్న ఏనుగులు సాయంత్రానికి వరిపొలంలోకి జారుకోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు. 20 రోజుల నుంచి గవరమ్మపేట, వెంకటరాజపురం, బాసంగి, రామినాయుడువలస, కన్నపుదొరవలస, సుభద్రమ్మవలస పరిసర ప్రాంతాలలో ఏనుగులు సంచరిస్తుండడంతో రైతులంతా ఆందోళనలో ఉన్నారు. రాత్రి సమయాన అవి ఎక్కడికి వెళ్లి ఏ పంటలు నాశనం చేస్తాయోనని భీతిల్లుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులు పంటచేలలోకి వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యాధికారిపై విచారణ



విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

సీతంపేట: మండలంలోని దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రతాప్‌పై గురువారం విచారణ జరిగింది. ఆ పీహెచ్‌సీలో పనిచేస్తున్న తమను ఆయన ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొద్ది రోజుల కిందట సీతంపేట వచ్చిన ఎస్టీ కమిషన్‌కు కొంతమంది వైద్యసిబ్బంది ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయాలన్న వైద్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులు, వైద్యాధికారి నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్‌లు తీసుకున్నారు. నివేదికలను డీఎంహెచ్‌వోకు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

మాంగనీస్ అక్రమ రవాణా

- ముగ్గురు వ్యక్తుల అరెస్టు



మాంగనీస్ లోడ్‌తో అధికారులకు చిక్కిన నిందితులు

రాయగడ: ఒక లారీలో మాంగనీస్ ముడిసరుకును అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖనిజ సంపదకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిన ఒడిశా రాష్ట్రం కాసీపూర్ సమితిలో గత కొద్ది నెలలుగా మాంగనీస్ ముడి సరుకు అక్రమ రవాణా జరుగుతున్నట్టు అటవీశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో బుధవారం అర్ధరాత్రి సమితిలోని లెల్లిగుమ్మ అటవీ రేంజ్ పరధిలో కాపుకాసి మాంగనీస్‌ను తరలిస్తున్న లారీని పట్టుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో విజయనగరం జిల్లాకు చెందిన వి.వెంకటేశ్వరరావు, ఎ.తరుణ్‌కుమార్, సీహెచ్ నరసింహరావు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న మాంగనీస్ ముడిసరుకు విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను కోర్టుకు తరలించారు. స్వాధీనం చేసుకున్న లారీ, ముడి సరుకును శంకరడ అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో భద్రపరిచారు.

హ్యాట్రిక్ సాధిస్తా

- అభివృద్ధి, సంక్షేమమే విజయానికి శ్రీరామరక్ష
- వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణి



కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కురుపాం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే నియోజకవర్గం ప్రజలు తనపట్ల చూపిస్తున్న అంతులేని ప్రేమాభిమానాలకు కారణమని వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి అంటున్నారు. 2014, 2019 ఎన్నికల్లో కురుపాం ఎమ్మెల్యేగా వరుసగా గెలుపొందిన పాముల పుష్పశ్రీవాణి ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ విజయం నమోదు చేసేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గానికి తాను అందజేసిన అభివృద్ధి, సంక్షేమఫలాలే వారధిగా నిలుస్తాయని ధీమాగా చెబుతున్నారు. దశాబ్దాలుగా టీడీపీ హయాంలో నియోజకవర్గంలో జరగని అభివృద్ధిని (రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం విషయంలో) వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చేసి నియోజకవర్గ ప్రజల కళ్లముందు ఉంచి వారి ఆదరాభిమానాలు చూరగొన్నామని స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఆమె సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్న విశేషాలిలా ఉన్నాయి. -కురుపాం

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి: నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటి?

జవాబు: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న మౌలిక సదుపాయాలైన రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు సమస్యలకు పరిష్కారం చూపించాను. రూ.1,045 కోట్లతో గిరిజన సంక్షేమ, పంచాయతీరా జ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల ద్వారా రహదా రులు, తాగునీరు, నాడు-నేడు పథకంలో పాఠశాలల అభివృద్ధి, సుందరీకరణ, ఆస్పత్రులకు అదనపు గదుల నిర్మాణం, మెరుగైన వైద్యసేవలు అందేలా పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది నియామకం చేపట్టాం. సంక్షేమ పథకాల మంజూ రులో పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను గుర్తించి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే ఐదేళ్ల పాలనలో రూ.1700 కోట్లు జమచేశాం.

సాక్షి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన రైతులకు ఏ మేరకు మేలు జరిగింది.

జవాబు: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన రైతులు పోడు భూములపై సాగు మాత్రమే చేసుకునే వారు. వారికి ఎటువంటి హక్కు పత్రాలు ఉండేవి కావు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కురుపాం నియోజకవర్గంలో 32,300 మందికి 68,811.78 ఎకరాలకు సంబంధించి ఆర్ఓఎఫ్ఆర్, డీకేటి పట్టాలను అందజేశాం. అంతేకాకుండా వారందరికీ ప్రతి ఏడాది పెట్టుబడి సాయం కింద వైఎస్సార్ రైతు భరోసా సొమ్ము అందుతుండడంతో సంతోషంగా ఉన్నారు.

సాక్షి: నియోజకవర్గంలో పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలేమిటి?

జవాబు: కొమరాడ మండలంలోని పూర్ణపాడు-లాభేసుపై వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. గత టీడీపీ ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేసిన కారణంగా వంతెన నిర్మాణం సగంలోనే నిలిచిపోయింది. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత కొత్తరేట్లకనుగుణంగా మరో రూ.7 కోట్లు టీఎస్పీ గ్రాంట్ మంజూరు చేసింది. మొత్తం రూ.14 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. అలాగే 1976వ సంవత్సరం నుంచి అభివృద్ధికి నోచుకోని జియ్యమ్మవలస మండలంలోని వట్టిగెడ్డ జలాశయం అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఈ జలాశయం వల్ల ఎంతోమంది రైతులకు మేలు జరుగుతుంది.

ఈ నేపథ్యంలో జైకా నిధులు రూ.44.85 కోట్లతో పనులు జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

సాక్షి: మీ కృషితో మంజూరైన కురుపాంలోని గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు ఎంత వరకు వచ్చాయి? ఈ కళాశాల ఏర్పాటు వల్ల ఏ మేరకు ఉపయోగం ఉంటుంది?

జవాబు: కురుపాం చరిత్రలో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను 105 ఎకరాల విస్తీర్ణంలో రూ.190 కోట్ల అంచనా విలువతో చేపట్టిన పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ కళాశాల నిర్మాణం పూర్తయితే పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఉన్న కురుపాం, పాలకొండ, పార్వతీపురం, సాలూరు ప్రాంతాల నిరుపేద గిరిజన విద్యార్థులకు మెరుగైన ఉన్నత విద్య అభ్యసించే అవకాశం ఉంటుంది.

సాక్షి: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మీ ప్రచారం ఎలా సాగుతోంది? ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

జవాబు: నియోజకవర్గంలో ప్రణాళిక ప్రకారం ప్రచారం చేస్తున్నాం. ప్రచారం ఎంతో బాగా జరుగుతోంది. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా స్వచ్ఛందంగా వస్తున్నారు. దీనికి ముఖ్య కారణం తమ ప్రభుత్వంపైన ఉన్న నమ్మకం, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే.

గిరిజన వర్సిటీ పేరుతో.. రియల్ మోసం





ఈ రెండు చిత్రాలను చూశారా... ఒక చిత్రంలో కనిపిస్తున్న ప్రహరీ గిరిజన వర్సిటీ కోసం కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెంలో రూ.5 కోట్ల ప్రజాధనంతో చంద్రబాబు హయాంలో నిర్మించినది. ఆ పక్క చిత్రంలోని లే అవుట్ చూశారా.. ఇది హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు, చంద్రబాబు వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ సమీప బంధువు ఇక్కడ సుమారు 3 వందల ఎకరాల్లో వేసిన లేఅవుట్. బంధువు రియల్ ఎస్టేట్ భూములకు డిమాండ్ వచ్చేలా నిర్మాణానికి వీలుకాని భూముల్లో వర్సిటీ ఏర్పాటుకు గత చంద్రబాబు ప్రభుత్వం ఆగమేఘాలమీద శంకుస్థాపన చేసేసింది. ఈ స్థలం పనికిరాదని కేంద్ర బృందం వారిస్తున్నా టెంకాయ కొట్టేసి, ప్రహరీ నిర్మాణ పనులను బినామీకి అప్పగించింది. అంతే.. అదిగో గిరిజన వర్సిటీ.. ఈ ప్రాంతమంతా బంగారుమయం అవుతుందంటూ పచ్చపత్రికలో ఊహాజనిత కథనాలు.. వీటిని చూపిస్తూ రియల్‌ఎస్టేట్ వ్యాపారి తనదైన శైలిలో ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను నమ్మించారు. తన రియల్ ఎస్టేట్‌లోని ప్లాట్‌లను అధిక ధరలకు అమ్మేశారు. రూ.వందల కోట్లు ఆర్జించారు. కొనుగోలుదారులను నిలువునా ముంచేశారు. స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు సగం ధరకు అమ్మేందుకు సిద్ధపడినా కొనుగోలు చేసేవారు కరువయ్యారు. ఇది.. చంద్రబాబు అండ్ కో భూ మాయాజాలం. ఈ మోసంలో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులకూ భాగం ఉంది. ఈ విషయం బహిర్గతం కావడంతో వర్సిటీని వేరే ప్రాంతానికి తరలించేశారంటూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు.



గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం గిరిజనేతర ప్రాంతంలో సేకరించిన కొండప్రాంతం ..

- 2014లోనే కేంద్రం మంజూరు చేసినా తూతూ మంత్రంగా పనులు
- సొంత సామాజిక వర్గ రియల్ ఎస్టేట్ కోసం వర్సిటీ ఆశయానికి గండి
- గిరిజన ప్రాంతానికి చేరువగా ఉండాల్సిన ప్రాంగణాన్ని విశాఖకు చేరువలో ఏర్పాటు
- రూ.5 కోట్ల ఖర్చుతో ప్రహరీ పనులు బినామీలకు అప్పగింత
- అమరావతి తరహాలో భూ పందేరం
- వర్సిటీ పేరుతో సొమ్ము చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వర్సిటీ ఆశయానికి అనుగుణంగా చర్యలు
- సాలూరు నియోజకవర్గంలో 561.88 ఎకరాల భూమి సేకరణ
- రైతులకు పరిహారం చెల్లించిన తర్వాత ముఖ్యంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- రూ.60కోట్లతో మౌలిక వసతులు

కొత్తవలస: తిమ్మిని బమ్మిని చేయడం.. బమ్మిని తిమ్మిని చేయడం వంటి కనికట్టు విద్యల్లో తెలుగు దేశం అధినేత నారా చంద్రబాబునాయుడుకి మించిన వారు ప్రపంచంలోనే ఉండరు. అధికార దర్పణంతో ప్రజాధనాన్ని లూటీ చేయడం.. తమ సామాజిక వర్గానికి మేలు చేయడంలో ఆయన మించిన వారు మరొకరు లేరు. వాస్తవాలను మరుగున పెట్టి మోసం చేయడంలో ఆయన దిట్ట. ఇదే తరహాలో ఎస్.కోట నియోజకవర్గ ప్రజలను నిలువునా ముంచేశారు. కొత్తవలస ప్రాంతంలో గిరిజన వర్సిటీ పేరుతో చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు కలిసి పెద్ద ఎత్తున భూ వ్యాపారాలు చేపట్టారు. తమదైన శైలిలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిపారు. ఈ ప్రాంతీయుల నుంచి రూ.వందల కోట్లు కొల్లగొట్టారు. కారుచౌకగా ఉన్న స్థలాలను అధిక ధరలకు విక్రయించి మోసం చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాకతో వాస్తవాలు వెలుగులోకి...

2019లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజన వర్సిటీ నిర్మాణ విషయంలో కేంద్ర బృందం ఇచ్చిన నివేదిక బహిర్గతమైంది. తెలుగుదేశం ప్రభుత్వం చేసిన తప్పును గుర్తించింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు గిరిజన వర్సిటీని గిరిజన ప్రాంతంలో నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా అచ్చమైన రిజర్వ్‌డ్ పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్‌ల ప్రాంతమైన సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సుమారు 561.88 ఎకరాలను సేకరించింది. గిరిజన వర్సిటీకి 2023 ఆగస్టు 25న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. గిరిజన విద్యార్థుల చదువుల ఆశయం నెరవేర్చేలా వర్సిటీ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. తొలుత రూ.60కోట్లతో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు.

ఇంకా ముంచేసేందుకు...

చంద్రబాబు అండ్ కో చేసిన రియల్ ఎస్టేట్ మోసం అందరికీ తెలిసిపోవడంతో కొనుగోలుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆర్థికంగా నష్టపోయిన వందలాది మంది టీడీపీ నాయకులను ఎక్కడికక్కడే నిలదీస్తున్నారు. దీంతో ఇటీవల ఎస్.కోట పర్యటనలో భాగంగా ఎల్.కోట మండలం సోంపురం కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో గిరిజన వర్సిటీని మళ్లీ కొత్తవలస తీసుకొస్తామంటూ నారా లోకేశ్ సత్యదూరపు ప్రకటన చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వంతపాడారు. అంటే... రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏ స్థాయిలో జరిపారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కొనుగోలు చేసేవారు ఉంటే ముంచేసేందుకు లోకేశ్‌తో పాటు లలితకుమారి సిద్ధంగా ఉన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అప్పటి మంత్రి సుజయకృష్ణరంగరావు, కోళ్ల లలితకుమారి కలిసి గిరిజన వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం (ఫైల్)

వాస్తవం ఇది..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీని కేంద్ర ప్రభుత్వ మంజూరు చేసింది. ఈ యూనివర్సిటీని గిరిజన ప్రాంతం, రిజర్వ్‌డ్ అసంబ్లీ లేదా పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో నిర్మించాలి. దీని కోసం తొలివిడతగా రూ.834 కోట్లను కేటాయించి రూ.426 కోట్లను విడుదల చేసింది. దీంతో చంద్రబాబునాయుడు అండ్ కో చకచకా పావులు కదిపారు. యూనివర్సిటీ నిర్మాణ నిబంధనలను తుంగలో తొక్కేశారు. ముందుగా విశాఖకు అతి సమీపంలోని కొత్తవలస ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములను అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం, వాటికి ఆనుకొనిఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం వంటి పనులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో అతి తక్కువ ధరకు వందల ఎకరాలను కూడబెట్టారు. ప్లాట్‌లు వేశారు. ఇదంతా చూసిన స్థానికులు వీరికేం పిచ్చి.. నివాసయోగ్యంకాని చోట ప్లాట్‌లు వేస్తున్నారని అనుకున్నారు. అప్పుడే మొదలైంది చంద్రబాబు డ్రామా. వారి రియల్ వ్యాపారానికి జాతీయ గిరిజన యూనివర్సిటీ పేరు పెట్టారు. నిబంధనలు దాచిపెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారు. 2017 సంవత్సరంలో కొత్తవలస మండ లం రెల్లి రెవెన్యూ గ్రామం అప్పన్న దొరపాలెం సమీపంలో నిర్మాణానికి ఏ మాత్రం అనువుగా లేని కొండ ప్రాంతంలో సర్వే నంబర్ 1-8లో 526.24 ఎకరాల భూమిని గుర్తించారు. ఇందులో కొంత కొండవాలు ప్రాంతంలో 180 మందికి ఇచ్చిన పట్టా భూమి 185 ఎకరాలను సైతం సేకరించారు. యూనివర్సిటీ నిర్మాణానికి భూసేకరణ పూర్తయిందంటూ కేంద్రానికి నివేదికలను పంపారు. ఎన్నికలకు ఏడాది సమయం ఉండగా హడావిడిగా అప్పటి భూగర్భ గనులశాఖ మంత్రి సుజయకృష్ణరంగారావు చేతుల మీదుగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో 2017 డిసెంబర్ నెలలో శంకుస్థాపన చేశారు. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వ అధికారులు పర్యటించి ఈ ప్రాంతం వర్సిటీ నిర్మాణానికి అనువుగా లేదని, ఈ ప్రాంతం ఎస్టీ సెగ్మెంట్‌లో లేదని వ్యతిరేకించారు. నివేదిక సైతం ఇచ్చారు. అయినా.. తమ రియల్ ఎస్టేట్‌వ్యాపారం పూర్తయ్యేవరకు చంద్రబాబు అండ్ కో ఈ నివేదికను బహిర్గతం చేయలేదు. తమ అనుకూల మీడియాతో ఈ ప్రాంతం ఆంధ్రాయూనివర్సిటీ పరిసరాల వలే అభివృద్ధి చెందుతుందని, వర్సిటీ ప్రహరీ పనులు ప్రారంభమైపోయాయంటూ ఊహాజనిత కథనాలతో ప్రచారం చేశారు. ఒక్క ప్రహరీతో కారుచౌకగా కొనుగోలు చేసిన భూములను వందలకోట్ల రూపాయలకు అమ్మేసి.. కొనుగోలుదారులకు పంగనామం పెట్టారు.

ఆర్థికంగా దెబ్బతీశారు..



తెలుగుదేశం పార్టీ నేతలు ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు చేసే కనికట్టు విద్యల్లో ఆరితేరారు. గిరిజన వర్సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరతీశారు. వేలకోట్ల రూపాయలు దోచుకున్నారు. ఈ ప్రాంతీయులను ఆర్థికంగా దెబ్బతీశారు. ప్రజలు అప్రమత్తం కాకుంటే ఎన్నిసార్లైనా ముంచేందుకు టీడీపీ నాయకులు సిద్ధంగా ఉంటారు. తస్మాత్ జాగ్రత్త!.

– కడుబండి శ్రీనివాసరావు
శృంగవరపుకోట ఎమ్మెల్యే

తొలిరోజు బోణీ ఒకటి!

- ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ
- స్వతంత్ర అభ్యర్థిగా జయరాజు నామినేషన్



సాక్షి, పార్వతీపురం మన్యం: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టానికి అడుగుపడింది. జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ గురువారం విడుదల చేశారు. వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. తొలిరోజు కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఒక నామినేషన్ దాఖలైంది. బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన నిమ్మక జయరాజు స్వతంత్ర అభ్యర్థిగా కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో వీవీ రమణకు ఒక సెట్ నామినేషన్‌ను అందజేశారు. ఆయన కురుపాం అసెంబ్లీ స్థానంతోపాటు, అరకు ఎంపీ స్థానానికి కూడా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఏకాదశి కావడంతో వైఎస్సార్‌సీపీ కురుపాం అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి, పాలకొండ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, సాలూరు అభ్యర్థి పీడిక రాజన్నదొర నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కూటమి అభ్యర్థులు 20వ తేదీ నుంచి 24వ తేదీలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ ఉపసంహరణకు 29న మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం కల్పించారు. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. మే 13వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను స్వీకరించేందుకు పార్వతీపురం కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. పాలకొండ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. పార్వతీపురం శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, సాలూరు, కురుపాం శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా తహసీల్దార్ కార్యాలయాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయాలుగా నిర్ణయించారు. ఆ మేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

అభ్యర్థుల ఖాతాలో ఖర్చు లెక్కింపు

నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో గురువారం నుంచే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులను వారి ఖాతాలో నమోదు చేస్తారు. పత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్, ప్రకటనలు, వార్తలను సైతం వారి ఖాతాల్లోనే లెక్కిస్తారు. అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చుపెట్టొచ్చు.

గిరిజన గ్రామాల్లో పోలీసుల కవాతు

మక్కువ: మండలంలోని గిరిజన గ్రామం నందలో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించేందుకు పోలీసులు ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు ఎస్సై పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ బలగాలు గ్రామంలో పర్యటించాయి. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగరాదని ఈ సందర్భంగా పోలీసులు పిలుపునిచ్చారు. గ్రామంలో మద్యం విక్రయించరాదని, ఎటువంటి సమాచారం తెలిసిన పోలీసులకు తెలియజేయాలని కోరారు.

క్లుప్తంగా

సారాతో వ్యక్తి అరెస్టు



ఎస్ఈబీ అధికారుల అదుపులో నిందితుడు, సారా ప్యాకెట్లు

సీతానగరం: మండలంలోని బక్కుపేట గ్రామంలో ఎస్ఈబీ సీఐ జె.శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం తనిఖీలు చేపట్టిన సమయంలో 190 సారా ప్యాకెట్లతో ఓ వ్యక్తి పట్టుబడగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామానికి చెందిన పి. లక్ష్మణదొర ఇంట్లో తనిఖీలు చేసి సారాను గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై బి.రాజశేఖర్ పట్నాయక్, జె.జగన్నాథరావు, ఎం. శ్రీవాణి, హెచ్‌సీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి



గాయపడ్డ సన్యాసిరావు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామానికి చెందిన ఎం.సన్యాసిరావును అదే గ్రామానికి చెందిన ఆరిపాక సంతోష్ కత్తితో గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలు.. వావిలపాడుకు చెందిన ఆరిపాక సంతోష్ మద్యం సేవిస్తూ వుంటాడు. సన్యాసిరావుకు సంతోష్ వరుసకు కుమారుడు అవుతాడు. మద్యం సేవించడం మంచిది కాదని సంతోష్‌ను మందలిస్తూ వుండే వాడు. దీన్ని తట్టుకోలేని సంతోష్ గురువారం ఉదయం సన్యాసిరావు ఇంటికి వెళ్లి కత్తితో పీకపై గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో కుటుంబీకులు సమీపంలో వున్న ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వీఆర్ పోలీసులైన్స్‌లో నడపబడుతున్న పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్ బయాలజీతో పాటూ ఇంగ్లిష్ సబ్జెక్ట్ కూడా బోధించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే ఒరిజినల్ ధ్రువపత్రాలు, రెజ్యూమ్ తీసుకుని ఏప్రిల్ 26 ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించబోయే టీచింగ్ డెమో, మౌఖిక పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు బీఈడీ విద్యార్హతతో పాటూ అర్హతలు కలిగిన అభ్యర్థులు స్కూల్‌లో నిర్వహించే మౌఖిక పరీక్షకు ఆ రోజు హాజరు కావాలన్నారు. వివరాలకు 94917 99315, 91211 09485 సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్‌లో డీఎడ్ హాల్‌టికెట్లు

విజయనగరం అర్బన్: ఈ నెల 22 నుంచి 27 వరకు జరిగే డీఎడ్ మూడవ సెమిస్టర్ (2022–24 బ్యాచ్ మరియు ఒన్స్ ఫైల్డ్), మొదటి సెమిస్టర్ (2023–25 బ్యాచ్ మరియు ఒన్స్ ఫైల్డ్) పరీక్షలకు హాజరగు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు వెబ్‌సైట్‌లో పొందుపరచామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల కోసం 'బీఎస్ఈ.ఏపీ.జీవీ.ఐఎన్' వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడి

డెంకాడ: మండలంలోని ఒక గ్రామంలో అమానవీయ ఘటన జరిగింది. దిశ పోలీసులు అందించిన వివరాలు.. బుధవారం ఏడేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక విజయనగరంలోని ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విజయనగరం దిశ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని బాలుడి మృతి

రాజాం సిటీ : రాజాం పట్టణం చీపురుపల్లి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లచ్చయ్యపేటకు చెందిన గొండేటి భరద్వాజ్(10) అనే బాలుడు మృతి చెందాడు. రాజాం వైపు వస్తున్న ఓ వాహనం టిఫిన్ నిమిత్తం రోడ్డుపైకి వచ్చిన బాలుడిని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన వెంటనే బాలుడిని ప్రైవేట్ వాహనంలో రాజాంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సను అందిస్తుండగానే మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు సంతు, వెంకటేష్‌లు బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న రాజాం సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

ఆడాళ్లా మజాకా..!

- ప్రగతిపథంలో దూసుకుపోతున్న మహిళా మార్ట్
- ప్రారంభించిన మూడు నెలల్లో రూ.60 లక్షల వ్యాపారం

వీరఘట్టం: మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చర్యలతో పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టంలో ప్రారంభించిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రగతి పథంలో నడుస్తోంది. జిల్లాలోని వీరఘట్టం మండల కేంద్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌లో మార్కెట్ ధరల కంటే తక్కువకే నాణ్యమైన సరుకులను ప్రజలకు విక్రయిస్తుండడంతో ప్రారంభించిన మూడు నెలల్లోనే రూ.60 లక్షల వ్యాపారం జరిగింది. ఈ లెక్కన చూస్తే లాభాలు బాగా వచ్చే అవకాశం ఉందని మార్ట్ నిర్వాహకులు చెబుతున్నారు. వీరఘట్టం పట్టణంలో తొలి మహిళా మార్ట్‌ను డ్వాక్రా సంఘాల సౌజన్యంతో ఈ ఏడాది జనవరి 12న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రారంభించి ఆయనే మొదట కొనుగోలు చేశారు. ప్రారంభించిన రోజున కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆకాంక్షించిన విధంగానే ఈ మార్ట్ వ్యాపారాభివృద్ధి చెందింది.



మార్ట్‌లో అందుబాటులో ఉన్న సరుకులు

మార్ట్ ఏర్పాటు ఇలా..

వీరఘట్టం మండలంలోని 1600 మహిళా సంఘాల్లో ఉన్న 15 వేల మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.200 చొప్పున పెట్టుబడితో రూ.30 లక్షలు పోగు చేశారు. ఈ డబ్బుతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు మరి కొన్ని కార్పొరేట్ కంపెనీల్లో సరుకులను మార్కెటింగ్ చేశారు. మరి కొన్ని సరుకులను హోల్‌సేల్ షాపుల్లో ఖరీదు చేశారు. ఇలా వివిధ రకాలుగా ఖరీదు చేసిన సరుకులను వీరఘట్టం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన మార్ట్ ద్వారా ప్రజలకు అతి తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. దీంతో అటు డ్వాకా సంఘాల సభ్యులతో పాటు ప్రజలు కూడా ఈ మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తుండడంతో మార్ట్‌లో వ్యాపారం జోరందుకుంది.



వీరఘట్టంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్

60 శాతం లాభాలు పెట్టుబడి పెట్టిన మహిళలకే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన మహిళలకు 60 శాతం లాభాలను ఇవ్వనున్నారు. అలాగే 40 శాతం లాభాలను వ్యాపారాభివృద్ధికి పెట్టుబడి పెడతారు. ఈ వ్యాపారంలో కేవలం రూ.200 పెట్టుబడి పెట్టిన 15 వేల మంది మహిళలు నేడు వ్యాపారవేత్తలుగా మారుతున్నారు. మరి కొద్దిరోజుల్లో వ్యాపారంలో వచ్చిన లాభాలను ఆయా సంఘాల బ్యాంకు ఖాతాలకు జమచేస్తారు. వీరఘట్టంలో పాటు గరుగుబిల్లి, సీతంపేట,జియ్యమ్మవలస,వంగర మండలాల ప్రజలు నిత్యం వస్తూ ఇక్కడ సరుకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు అందరి చూపూ ఈ మహిళా మార్ట్‌పైనే పడింది.

రోజుకు రూ.60 వేల వ్యాపారం



మాకు తెలియని వ్యాపారం ఇది. అయినా సరే ప్రభుత్వం చొరవతో మార్ట్ ఏర్పాటు చేశాం. సరుకుల ధరలు ఎంతో తెలిసేవి కాదు.మహిళా సంఘాల సభ్యులందరి సహకారంతో సరుకులు విక్రయిస్తున్నాం.బయట నుంచి తెచ్చిన పప్పులు, ఇతర నిత్యావసర సరుకులను గ్రేడింగ్ చేసి ప్యాకింగ్ చేస్తున్నాం. షాపును అందంగా తీర్చిదిద్దడంతో సరుకులు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు బాగా వస్తున్నారు.ప్రస్తుతం రోజుకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు వ్యాపారం జరుగుతోంది.

దాసరి పుణ్యవతి, అధ్యక్షురాలు, వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్, వీరఘట్టం

మూడు నెలల్లో రూ.60 లక్షల వ్యాపారం..

15 మంది మహిళా కమిటీ సభ్యులతో వీరఘట్టంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ మూడు నెలల్లోనే రూ.60 లక్షల వ్యాపారం చేయడంపై అధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఎటువంటి వ్యాపార అనుభవం లేని వీరు ఇంత పెద్ద బాధ్యతను ఎలా చేపట్టగలరని తొలుత సందేహాలు వ్యక్తం చేసిన వారే ఇప్పుడు శభాష్ అంటున్నారు. జిల్లాలో మరికొన్ని మార్ట్‌ల ఏర్పాటుకు వీరఘట్టం మార్ట్ రోల్ మోడల్‌గా మారిందని ప్రశంసిస్తున్నారు.

పెళ్లింట విషాదం

- సారిసామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా రోడ్డుప్రమాదం
- సంఘటన స్థలంలోనే మహిళ మృతి
- మరో పదకొండు మందికి తీవ్రగాయాలు



భద్రగిరి ఆస్పత్రిలో కమల మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: వివాహానంతరం వధువుకు ఇవ్వాల్సిన సారి సామగ్రి ఇచ్చేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదం పెళ్లివారింట విషాదం నింపింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా..మరో 11 మంది తీవ్రగాయాల పాలయ్యారు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలంలోని కాకితాడ గ్రామానికి చెందిన పెద్దింటి కాంతారావు, సరోజినిల కుమార్తె లిఖితకు కొమరాడ మండలంలోని పూడేసు గ్రామానికి చెందిన యువకుడితో ఇటీవలే వివాహమైంది. వధువుకు సారిసామగ్రి ఇచ్చేందుకు కుటుంబసభ్యులు, బంధువులు గురువారం ట్రక్కర్లు, ఆటోల్లో బయల్దేరారు. ఈ క్రమంలో అందరికంటే వెనుకగా వధువు సొంతకుటుంబీకులను తీసుకువెళ్తున్న ట్రక్కర్ రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో అదుపుతప్పి ప్రధానరహదారిలోని కల్వర్టుగోడను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ వాహనంలో ఉన్న వధువు మేనత్త కమిడి కమల(55) అక్కడికక్కడే మృతిచెందగా..మృతురాలి తమ్ముడు పెద్దింటి భుజంగరావు, మరదలు సుజాత, మరో మేనకోడలు బి. సుగుణ, మేనకోడలి కుమారుడు చైతన్య, మేనకోడలు సుగుణ భర్త రవితో పాటు ఇతర కుటుంబసభ్యులు గంటా పవన్, లిమ్మ సుమన్, పాలక శశిరేఖ, పి.మారతమ్మ, ఎస్.పుష్పరాజ్‌లతో పాటు డ్రైవర్ తేజ తీవ్రగాయాలపాయ్యారు. ప్రమాదం జరిగిన విషయాన్ని గమనించిన ఇతర కుటుంబసభ్యులు క్షతగాత్రులను హుటాహుటిన భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో కమలను పరీక్షించిన వైద్యాధికారి రవికుమార్ ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అలాగే తల పుర్రెభాగంలో తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల బాలుడు చైతన్యతో పాటు మారతమ్మ, పుష్పరాజు, తదితరులను మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కురుపాం ఎస్సై ఎస్.షన్ముఖరావు తెలిపారు.

గర్భిణుల నమోదు త్వరగా జరగాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: గర్భిణుల నమోదు త్వరితగతిన జరగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం, గరుగుబిల్లి మండలాలకు చెందిన పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్యసిబ్బందితో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని స్థానిక ఎన్‌జీఓ భవనంలో గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణికి పూర్తిస్థాయిలో, కచ్చితమైన వైద్య సేవలందాలంటే క్షేత్రస్థాయిలో అర్హులైన జంటలను గుర్తించి, సకాలంలో గర్భనిర్ధారణ పరీక్షలు చేసి గర్భిణుల నమోదు (రిజిస్ట్రేషన్) త్వరగా మొదటి త్రైమాసంలోనే చేయాలని, అందుకు అవసరమైన పూర్తి వివరాలు మాతాశిశు సంరక్షణ కార్డులో పొందుపర్చాలని సూచించారు. తద్వారా ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు గర్భిణికి త్వరగా నిర్వహించి ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే సత్వరమే గుర్తించవచ్చని, సరైన చికిత్స, పర్యవేక్షణ చేయడం ద్వారా హైరిస్క్ ఆరోగ్య సమస్యలకు గురికాకుండా జాగ్రత్త పడవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా హిమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతిరోజూ ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వేసుకునేలా పర్యవేక్షించాలని, అవసరమైన ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇవ్వాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణికి అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా చూడాలని స్పష్టం చేశారు.

ప్రిజం10 అమలు తీరును పర్యవేక్షించాలి

ప్రిజం10 అమలు తీరును పర్యవేక్షించాలని వైద్యాధికారులకు డీఎంహెచ్ఓ సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారలోపం, శ్వాస సంబంధ సమస్యలున్న వారిని త్వరగా గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని, సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలన్నారు. గ్రామాల్లో వడదెబ్బ, వేసవి జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నారాయణరావు, డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్.రఘుకుమార్, డాక్టర్ ఎం.వినోద్, డీపీహెచ్ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, ఎస్ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళావతి ప్రచార జోరు

- ప్రచారంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



గారమ్మ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి, పార్టీ నాయకులు



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఇంటింట ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ:

ఎన్నికల ప్రచారానికి వస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి జనం నీరాజనం పడుతున్నారు. ప్రచారం చేస్తున్న ఆమెకు మహిళలు హారతి వచ్చి ఆశీర్వచనాలు అందజేస్తున్నారు. పెద్ద సంఖ్యలో తరలివస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు 15,16,17,18 వార్డుల పరిధిలోని గారమ్మ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. కాలనీలో ఇంతవరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రానికి సీఎం జగన్ మోహనరెడ్డి అందించిన సుపరిపాలన కొనసాగాలంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. పలు వర్గాల ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. వీధుల్లో ప్రచారం నిర్వహించిన ఆమెకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెతో పాటు ప్రచారంలో పార్టీ నాయకులు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, వై లిల్లీపుష్పనాథం కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, కొంచాడ అరుణ్‌కుమార్, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, కిల్లారి మోహన్, బాసూరు కాంతారావు, కొడెం విజయకుమార్, కొరికాన గంగునాయుడు, కోరాడ సూర్యనారాయణబాబు, కోరాడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు, వాటర్ పైపులు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో మీసాల రమేష్‌కు చెందిన ఎకరన్నర గడ్డివాము, 80 నీటి పైపులు దగ్ధమయ్యాయి. గురువారం గడ్డివాము వద్ద ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి వెనువెంటనే ప్లాస్టిక్ పైపులకు మంటలు అంటుకుని కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు 2 లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు లబోదిబోమంటున్నాడు. అలాగే సంతకవిటి మండలం తాలాడ గ్రామానికి చెందిన బెరవ అప్పలనాయుడు, బెవర రాజారావుల గడ్డివాములతో పాటు 20 బస్తాల ధాన్యం కాలిపోయాయి. రాజాం ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

అప్పుల భయంతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు నూకందొర

బాడంగి: అప్పులు తీర్చలేనన్న భయంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని చినభీమవరం గ్రామానికి చెందిన ఉయ్యాల నూకందొర అలియాస్ ఆది (45) విజయనగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు ఇంట్లో భార్యకు తెలియకుండా రూ.50వేల వరకు అప్పులు చేశాడు. ఈ మొత్తాన్ని ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురై బుధవారం ఉదయం అరటి తోట వద్ద పురుగుల మందు తాగి వాంతులు చేసుకొంటూ ఇంటికి చేరుకున్నాడు. భార్య పద్మ చూసి ఏమైందని ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో కుటుంబీకుల సహాయంతో 108 ద్వారా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి తల్లి అప్పలనర్సమ్మ, భార్య పద్మ ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆర్.జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఆత్మహత్య



మృతుడు శ్రీనివాసరాజు (ఫైల్)

లక్కవరపుకోట :

మండలంలోని ఒక చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకలపాటి శ్రీనివాసరావు (47)గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు... నిందితుడు వారం రోజుల కిందట 8 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి యత్నించాడని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా అప్పటి నుంచి నిందితుడు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఆదివారం 10 గంటల ప్రాంతంలో ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పురుగులు మందు సేవించి అపస్మారక స్థితికి శ్రీనివాసరావు చేరుకోవడంతో స్థానికుల సహాయంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యాడు. దీంతో పోలీసులు నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం మండల కేంద్రం కిత్తన్నకట్టు గెడ్డ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెళ్లి పరిశీలించగా మృతదేహం నిందితుడు శ్రీనివాసరాజుగా గుర్తించారు.

ఈ మేరకు మృతుడు తల్లి, తమ్ముడులకు సమాచారం అందించగా మృతదేహాన్ని వారు వచ్చి పరిశీలించి శ్రీనివాసరాజు అని నిర్ధారించారు. మృతుడు తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకుడు

- కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శన



కమాడ్ కంట్రోల్ రూమ్‌లో పనితీరును వ్యయపరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్‌కు వివరిస్తున్న జేసీ శోభిక

పార్వతీపురం: జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల వ్యయపరిశీలకుడిగా రమాకాంత్ ప్రధాన్‌ను, అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయపరిశీలకుడిగా గురుకరణ్ సింగ్‌ను ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు జిల్లా వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ గురువారం జిల్లాకు చేరుకున్నారు. జిల్లాకేంద్రంలోని డా.వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలోని అతిథి గృహం–2లో ఆయన బసచేస్తారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను శాసనసభ నియోజక వర్గాల వ్యయ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ గురువారం సందర్శించారు. ఈ మేరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రవర్తన నియమావళి విభాగం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా విభాగం, వ్యయవిభాగం, ఫిర్యాదుల విభాగం, చెక్ పోస్టుల పర్యవేక్షణ నియంత్రణ విభాగం, జియోట్యాగింగ్ వాహనాల పర్యవేక్షణ తదితర విభాగాలను ఆయన నిశితంగా పరిశీలించారు. జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక కమాండ్ కంట్రోల్ పనితీరును ఆయనకు వివరించారు. తొలుత కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్‌ను చాంబర్‌లో కలిసిన వ్యయ పరిశీలకుడు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం పార్వతీపురం, కురుపాం శాసనసభ నియోజకవర్గాల్లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవానాయుడు, కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారి, ఎస్‌డీసీ ఆర్‌వీ సూర్యనారాయణ, ఎంసీసీ నోడల్ అధికారి ఎం.డి.గయాజుద్దీన్, సోషల్ మీడియా నోడల్ అధికారి యు.సాయికుమార్, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఎల్.రమేష్, సహాయ వ్యయపరిశీలకులు ఆర్‌వీ.రమణమూర్తి, పర్యవేక్షకురాలు సుజాత పాల్గొన్నారు.